"ఒసేయ్"—భార్యను పిలిచాడు.

"ఏం?"

"కోడిగుడ్లూ, పెరుగూ అమ్మి తుంటివిగదే. ఆ డబ్బు ఎక్కడ పెట్టావ్?"

"తీసుకువెళ్లి వాడి యెదాన వేసి వస్తావా?" అన్నది భార్య.

"మరి గొడ్డును తోలుకొచ్చుకోవాలి గదే."

"ఏమో, ఏం చేస్తావో! నన్ను మాత్రం అడక్కు" అన్నది భార్య.

వెంకటయ్య భార్యకు నయానా భయానా చెప్పి చూశాడు. కాని ఆమె వినలేదు. "ససేమిరా అంటే ససేమిరా" అంది. "ఇస్తావా, ఇవ్వవా?" అన్నాడు వెంకటయ్య వొళ్లుతెలియని కోపంతో.

"ఇవ్వను" అన్నది భార్య

కోపం పట్టలేకపోయాడు వెంకటయ్య. చెంపమీద పెడేలున ఒక్కటి వేశాడు. తన భార్య డబ్బు ఎక్కడ దాచేదీ అతనికి తెలుసు. ఉట్టిమీద వున్న పిడత తీసి, డబ్బులు తీసుకొని బుచ్చయ్య ఇంటికి వెళ్లాడు. అతను నోరు చేసుకుంటూవుంటే ఈసారికి తప్పు కాయమని ప్రాధేయపడ్డాడు. బొడ్డువిప్పి పది రూపాయలూ సమర్పించుకున్నాడు. ఆవు బందెలదొడ్లో వుందని తెలుసుకున్నాడు. అక్కడ కట్టవలసిన డబ్బు కట్టి, ఆవుని తోలుకొచ్చుకోటానికి లోపలకు వెళ్ళాడు. తన ఆవును చూచి నిలువుగుడ్లువేసి నిలబడ్డాడు. ఆవు ఒంటి నిండా రక్తపు మరకలే. దుర్మార్గుడు బుచ్చయ్య గొడ్డుని చావమోదాగు. అతని కళ్లలో నీళ్లు తిరిగినై. ఆవు పసికట్టినట్టుంది; గిరుక్కున తిరిగింది. యజమానివి చూచింది. "అంబా" అని అరిచింది — ఒక్కసారి. ఆ అరుపు బాకులా దిగబడింది వెంకటయ్య హృదయంలోకి. కండ్ల వెంట బొటబొట కన్నీరు కారుస్తూ "తప్పు నీదికాదు— నాది. నా పాపం నువ్వు మోస్తున్నావు. వచ్చే జన్మకు నీ బిడ్డనై పుట్టి నీ ఋణం తీర్చుకుంటాను" అన్నాడు— ఆవు మేను నవరిస్తూ. ఆవు తెలుసుకున్నట్టే తనూ కన్నీరు కార్చింది.





# స్వప్నం సత్యం

## వసంతలక్ష్మి

"మేడమ్!" మృదువైన చేతులు తట్టి లేపేయి. ఉలిక్కిపడి లేచి కూర్చుంది శైలజ.

మౌనంగా మందు అందించింది నర్స్!

చిరాకుగా కోపంగా చూసి, నిరాకరించింది శైలజ! "ప్లీజ్! వేసుకోండి. రౌండ్స్‌కి డాక్టర్‌గారు వచ్చేవేళయింది. మందులవి వేసుకోకండా మీరలా నిద్రపోతే రిమార్కు నా కొస్తుంది" అంటూ మందులు మింగించింది నర్స్.

నర్స్ ముఖంలో ఆప్యాయత, ప్రసన్నత వీటిని మించిన శాసించేధోరణి శైలజ కెంతయినా ఇష్టం.

నల్లటి బోర్డరుఉన్న తెల్లటి కాశ్మీరు సిల్ చీరకట్టి ముత్యాలహారం పొడవుగా వేసుకుని పాకుత్తూ దివినుండి దిగివచ్చిన శైలజలాగానే ఉంది. శ్రీమంతుల ఆడపడచులకుండే దర్పం, సభ్యసంస్కారాలూ అన్నీ ఉన్న శైలజని తొలిసారి చూడగానే తెలియని అభిమానం కలిగింది నర్స్‌కి.

దిళ్లు సరిచేస్తూ, "చలిగా ఉందా? కిటికీలు వేసెయ్యమంటారా" యాంత్రికంగా అడిగింది నర్స్.

"వద్దు! ఆ పనిమాత్రం వద్దు. విరగగాసే ఈ వెన్నెలవిచూస్తూ గడపాలనుంది."

"గుడ్‌నైట్! నిద్రపోవడానికి ప్రయత్నించండి" అంటూ వెళ్లిపోతున్న నర్స్‌ని 'ఒకమాట!' అంటూ వెనక్కి పిలిచింది శైలజ.

ఏమిటన్నట్లుగా వచ్చింది.

"మీ పేరుతో పిలవాలనుంది! అస్తమానూ నర్స్ అంటూ పిలవడం నాకేం బాగాలేదు."

అందంగానవ్వి. "నేను నర్స్‌నే" అంది.

"కాదు! మీ పేరుచెప్పాలి" బ్రతిమాలింది.

"శ్యామల! నల్లగా రూపానికి తగ్గట్లుగా ఉందికదూ?" మళ్ళీ నవ్వింది—

"ఛా! అలా ఎందుకనుకుంటారు? స్వీట్‌నేమ్."

"సరే మీ రూమ్‌లోకి వస్తే నా ఉనికి నేనే మరిచిపోగల ప్రమాదం ఉంది. మర్చిపోయాను, రేపే మీ కేస్ కండక్ట్‌చేయడానికి కొత్త డాక్టర్ వస్తున్నారు. సైకియాట్రిస్ట్" అంటూ వెళ్ళిపోయింది.

"సైకియాట్రిస్ట్..." బిగ్గరగా అరవాలనిపించింది శైలజకి. పగలబడి నవ్వాలన్పించింది, అలా చేస్తే మెంటల్ హాస్పిటల్లో పడేస్తారేమో నన్నభయం వేసి వెంటనే కళ్ళుమూసుకుని దీర్ఘంగా నిట్టూర్చింది.

"గుడీవినింగ్ మిసెస్ శైలజా! మీరింకా నిద్రపోలేదట?" డాక్టర్ కిశోర్ గదిలోకి వస్తూనే ప్రశ్నించేడు.

"వెరీ గుడీవినింగ్ డాక్టర్, నిద్ర రావటంలేదు..."

కుర్చీ మంచందగ్గిరగా లాక్కుని కూర్చుని 'ఎలాఉంది ఆరోగ్యం' అని ఫార్మల్‌గా అడిగేడు.

"ఫైన్"

"అబద్ధం! మీరేం ఇంప్రూవ్ కాలేదు. అనిల్ చేసే ట్రంకాల్స్‌కి ఏం జవాబు చెప్పాలో ఒకొక్కసారి నాకర్థం కావడంలేదు. మిమ్మల్ని అతనికి ఈ రూపంలో అప్పగించడం అసంభవం" ఆవేశంగా అనేసేడు.

నవ్వి. "పోనీ ఊపిరికూడా లేని ప్రతిమగా శైలజని అప్పగించండి!" పెంకిగాఅంది. చకితుడైపోయి కళ్ళప్పగించి చూస్తూండిపోయాడు. "సరదాగా" అన్నాను అంది, మాట మార్చేస్తూ.

క్షణమాత్రం ఊరుకుని, "మీరు చాలా విషయాలు అర్థంకాకుండా అనేస్తారు. మీకవి మామూలు విషయాలే కావచ్చు. అన్పించవచ్చును కూడా కాని, అవతలి వాళ్ళ నెంతగా "హర్ట్" చేస్తాయో మీ కర్థంకాదు, శైలజా! అనిల్‌కి అతి ప్రియమైన శైలజని పువ్వులలో పెట్టి అర్పిస్తాను. నా శపథం అది" నిశ్చలంగా పలికాడు.

"డాక్టర్! మరీ అంత సున్నితంగా ఉండకూడదు. సరదాగా అన్నమాటలు సరదాగానే తీసుకోవాలి. ఇవాళ వెన్నెల ఎంతో బాగుందికదూ?" కిటికీలోంచి చూస్తూ అంది.

"మీకేం? హేమంతాలూ శిశిర శైతల్యాలూ వెన్నెలా వీటిగురించి ఆలోచించగల అదృష్టవంతులు. నాకు నైట్‌డ్యూటీ మేడమ్!"

"ఆ పొడుగాటి చెట్లపేరేమిటి డాక్టర్? మా ఇంట్లో అవి వెయ్యాలనుంది"—

"అశోకవృక్షాలంటారు! మీరీ హాస్పిటల్‌నుంచి వెళ్ళబోయేముందు వాటిని మీకు ప్రజంటుచేస్తాను. వెన్నెల బాగుందని అన్నారుకదూ. రేపే వసంత పౌర్ణమి, ఉత్తరదేశంలో అత్యద్భుతమైన "వసంతరాత్రి." వెరీగుడ్! నిద్రరాకపోయినా నిద్రపోవడానికి ప్రయత్నించండి. మళ్ళీ నాలుగున్నరకి కాఫీవేళకి మీ దగ్గరకి వస్తాను. గుడ్‌నైట్". వేగంగా కదిలి వెళ్ళిపోయాడు కిశోర్.

బ్లాంకెట్ కప్పుకుని మెల్లిగా పక్కమీదకి వాలింది.

జీవితపు విలువలన్నీ అబద్ధం. ఆశలతో కట్టినవన్నీ పిచ్చిక గూళ్లు. అందుకే ఈ పలాయనం. కాని ఎక్కడికి! ఆలోచిస్తూనేఉంది.

"నిద్రపోతున్నారా?" రౌండ్ ముగించుకొని మళ్ళీ వచ్చింది శ్యామల!

"రా! శ్యామలా, ఇవాళ నిద్రరావడం లేదు!" అంటూ లేచికూర్చుంది.

"మా ఊళ్లో రేపెంత చక్కటి పండుగ శ్యామలా! వసంతాలు జల్లుకుంటూ ఎంత బాగుంటుందని...."

వెన్నెలరాత్రిలో ఎన్నో కథలు చెప్పింది శైలజ. మౌనంగా వింటూ కూర్చుంది శ్యామల.

* * *

"ఎవరాఅమ్మాయి? ఏమా కథ?" కాఫీ సిప్‌చేస్తూ అడిగాడు రవి.

"నా ఫ్రెండ్ అనిల్‌కుమార్ భార్య. హాస్పిటల్లో మన వైద్యం కుదరదు కాబట్టి ఆమెని నా ఇంట్లో అట్టేపెట్టుకుని మళ్ళీ మామూలుమనిషిని చేయాలి. ఆ పనిఅయినా చేయగలిగితే కొంత శాంతి. నేనివాళ ఇటువంటి హోదాలో ఉన్నానంటే అది అనిల్ దయాధర్మం తప్ప మరేంకాదు. అన్నీ ఉండి మనశ్శాంతి పోగొట్టుకున్న అనిల్‌కి నేను చేయగలిగే ఏకైక సహాయం!"

"అసలేమిటి ఆవిడగారి వ్యాధి?" ఆత్రంగా అడిగాడు రవి.

"రవీ! అదితెలిస్తే బొంబాయినుంచి విన్ను ఆఘమేఘాలమీద పిలిపించడం ఎందుకురా?" విసుగ్గా అన్నాడు కిశోర్.

"అయితే నీతో నేనూ హాస్పిటల్‌కి రానా?"

"ఊహూ! వద్దు. ఆవిడనే ఇంటికి

తీసుకొస్తాను. అనిల్‌కికూడా ట్రంకాల్ చేస్తాను. వెంటనే రమ్మని. నాకెందుకో నీమీద చాలా నమ్మకముందిరా రవి!" కళ్ళు చెమర్చేయి. జాలిగా చూసేడు రవి కిశోర్‌వి.

* * *

"హమ్మయ్య! రిలీఫ్‌గాఉంది డాక్టర్. ఇంకెన్నడూ ఈ హాస్పిటల్‌కి రాను!" కారు కదలగానే శైలజ అన్న వాక్యాలివి.

"రాకూడదనే మా అందరి కోరికా" నెమ్మదిగా జవాబిచ్చేడు కిశోర్.

"చూడండి డాక్టర్‌గారూ! వీలయితే నేనివాళ ఫ్లయిట్‌లోనే హైద్రాబాద్ వెళిపోతాను. రిజర్వ్‌చేయించరూ?"

వెనక్కి అనుకుని కూర్చుంది అతని పక్కనే. గుండ్రటి భుజాలూ తీర్చిదిద్దిన శరీరం. కాని ఆమె కళ్ళల్లో అమావాస్య చీకటి.

" వెళ్ళిపోదురుగాని. వారంరోజుల పాటు మెడ్రాస్‌లో ఉండి ఊరంతా చూసి మమ్మానందంపచేసేక, ఆ మీద ఉంటావని అన్నాకూడా ఒక్కనిమిషం ఉంచుకోను. గెంటేస్తాను"—

నీరసంగా నవ్వింది అతని మాటలకి. అందమైన బంగళాముందు కారాగింది. రాధామనోహరాల పందిరి విరగబూసి స్వాగతమిచ్చింది. 'దిగండి' అంటూ డోర్ తెరిచి నిలబడ్డాడు కిశోర్.

"మీ సామాన్లవీ నాయర్‌తెస్తాడు రండి," అంటూ లోపలికి దారితీసేడు.

అందమైనతోటా, విరగబూసినపువ్వులూ తోటంతాకలయచూస్తూ నిలబడిపోయింది.

"కమిన్!" అపరిచితస్వరానికి కళ్ళెత్తిచూసింది. ఎదురుగా కిశోర్ కాదు. ఇంకెవరో వ్యక్తి. ఎవరో కాదు. క్షణక్షణమూ తను ఆరాధిస్తూ గుండెల్లో దాచుకున్న మనోహర మూర్తి! లోకందృష్టిలో తను కలనైనా చూడకూడని—కాదు. తనుకలనైన మరువలేని రవి. ఇక్కడెలా ఎందుకు కన్పించేడు. అయోమయంగా చూస్తూండిపోయింది. రవి కూడా ఎక్కడో చూసిన జ్ఞాపకంలా ఉందనుకుంటూ నిలబడ్డాడు. నీరసంగా, నడవడానికి కూడా శక్తి లేనట్లుగా వాడిపోయిన కలువకాడలా అయిపోయి తూలిపడబోయిన శైలజని ఒక్క పరుగులో వెళ్ళి పట్టుకుని నెమ్మదిగా లోపలికి తీసికెళ్ళి సోఫాలో పడుకోపెట్టేడు. కిశోర్ ఇంజక్షన్‌చేసి ఆమె తెలివివచ్చేవరకూ ఆత్రంగా మొహంలోకి చూస్తూండి పోయాడు. కొంచెంసేపటికి కళ్ళుతెరిచి చూసింది.

కిశోర్‌ని పక్కకి వెళ్ళమని సైగచేసి తను వెళ్ళికూర్చున్నాడు రవి. అతన్ని చూసింది శైలజ. "లేవండి అలా కూర్చోండి."

బొమ్మలాగా లేచి కూర్చొంది.

నాయర్ కాఫీతెచ్చి అందించేడు. మౌనంగా తాగసాగింది.

"మిసెస్ శైలజా! నేను హాస్పి





టల్‌కి వెళ్ళాలి. మీ గది నాయర్ చూపిస్తాడు. కావల్సినన్ని మేగజీన్స్ ఉన్నాయి. అంతకంటే ఈ రవి, సారీ మీకు నేను పరిచయంచేయలేదుకదా! డాక్టర్ రవికాంత్! ఈవిడ మిసెస్. శైలజా అనిల్‌కుమార్, ఎం.ఎ. సైకాలజీ మెయిన్.కవయిత్రి" అంటూ తొందరగా అనేసి నవ్వాడు.

"రవిగారు నాకు తెలుసు" ఏ భావమూ ధ్వనించని స్వరంతో అంది.

ఈసారి మరీ ఆశ్చర్యంగా చూసేడు రవి ఆమెను.

"ఎలా తెలుసు?" ఆత్రంగా అడిగేడు కిశోర్!

"బి.ఎ. లో ఉండగా నా ఫ్రెండ్ శారద వాళ్ళింట్లో, వారి పరిచయం అయింది. శారదకి కజిన్ అనుకుంటా మీరు."

జ్ఞాపకమొచ్చింది రవికి. "నేను యం. బి. సెకెండియర్‌లో ఉండగా ననుకుంటా. చాలాఏళ్ళనాటి— బహుశా ఒకటిన్నర దశాబ్దంనాటి సంగతి. ఎం.ఎ. చదివేరన్నమాట." సంతోషంగా అన్నాడు రవి.

"అయితే ఇంకేం చక్కగా కబుర్లు చెప్పుకుంటూ గడిపెయ్యండి. వస్తానంటూ" వెళ్ళిపోయాడు కిశోర్.

జ్ఞాపకాల పీలిపీడల్లో శైలజ స్వరూపం కోసం వెతుక్కుంటున్నాడు రవి. ముద్దబంతి పువ్వులాగా నయనానందకరంగా ఉండేది. శారదతోపాటు చనువుగా తనతో కబుర్లుచెప్పేది. కలవారి ఏకైక గారాలపట్టి అని విన్నాడు. కాని ఈవేళ ఎదురుగా కూర్చున్న శైలజ కళ్ళల్లో నిరాశ, సామ్రాజ్యాలు పోగొట్టుకున్న మహారాణిలా తాండవిస్తోంది. డాక్టర్‌గా, స్నేహితుడిగా తనీమెని బాగుచెయ్యాలి. ఆ కళ్ళల్లో కౌముది కాంతు లీనాలి. ఇదొక పరీక్ష. తను నెగ్గాలి. ఆమెవైపు చూసేడు.



"ఎం.ఎ. చదివేరు కదా! జాబ్ చేస్తున్నారా?"

యథాలాపంగా అడిగినట్లు అడిగేడు. జవాబివ్వకుండా అలాగే కూర్చుంది.

"ఆ రోజుల్లో ఎంత ఉత్సాహంగా ఉండేవారు! ఇలా డల్‌గా అయిపోయారేం?"—

ఈసారీ మాట్లాడలేదు. టీపాయ్ మీదున్న పేపర్ చేతులోకి తీసుకుని తిరగేయ సాగింది.

ఆమెని మాట్లాడించ లేక నిస్సహాయంగా ఉండిపోయాడు.

ఇంతలో టెలిఫోన్ మ్రోగింది. వెళ్ళి అందుకున్నాడు. కిశోర్ పలికేడు.

"ఎలా ఉంది శైలజ?"—

"నో షీ ఈజ్ ఆల్ రైట్—కబుర్లు చెప్పుకుంటూ కాలం దొర్లించేస్తున్నాం!"

క్రీగంట ఆమెని చూసేడు రవి.

అలాగే కూర్చునిఉంది.

"స రే" నంటూ కిశోర్ ఫోన్ పెట్టేసేడు.

గది నిశ్శబ్దంగా ఉంది. ఆ నిశ్శబ్దం భరించలేనంతగా అన్పించింది. ఎదురుగా రవినిచూస్తూ ఏమేమో ఆలోచించ సాగింది శైలజ. కిశోర్ చెప్పినప్రకారం ఈమె ఎవరితో మాట్లాడదని, అదే పనిగా ఆలోచిస్తూఉంటుందని, జీవితంలో దేనిమీదా ఆసక్తిలేదని విన్నాడు. చదువూ, సంస్కారమూ, అందమూ, సంపదా, అన్నీ ఉన్నా ఈమెకి మానసిక



మయిన బాధ ఏదో ఉండాలి. అదేమిటో ఆవిడ చెప్పదు. గ్రహించి తొలగించాలి. తను "సైకియాట్రిస్ట్" క్యూర్ చేయడానికి వచ్చేడు.

నాయర్ భోజనం రెడీగా ఉందని చెప్పేడు.

"మిసెస్ శైలజాదేవీ పదండి భోజనానికి."

ఆహ్వానించేడు.

"అంతగా మన్నించనవసరం లేదు. శైలజా అంటే చాలు" అంది లేచినిలబడి.

భోజనాల దగ్గిరకూడా మౌనంగా ఉంది. సాధారణంగా ఇలాటి కేసులు వస్తే వాళ్ళని మాట్లాడించి నవ్వించి నలుగురిలో తిప్పి అనునయంగా మార్దవంగా దారిలోకితేవాలి.

అదేమంత సామాన్యమయిన విషయంకాదు. ఆవేశం అధికమైపోయి పిచ్చెక్కిపోకుండా చూసుకోవాలి. మహాబలిపురందాకావెళ్ళి, తిప్పి సన్నిహితం చేసుకోవాలి. దగ్గిర దగ్గిర ప్రదేశాలయితే అంతగా మాట్లాడే అవకాశం లేదు అనుకుని కిశోర్‌కి ఫోన్‌లో కారు పంపమని చెప్పేడు.

వెంటనే కారు వచ్చింది. డ్రైవర్‌ని వద్దన్నాడు. "అలా తిరిగివద్దాం రండి."

తల ఊపి వెంటనే వచ్చేసింది.

"థాంక్స్! మిమ్మల్ని నొప్పించి బలవంతంగా లాక్కెళ్ళాలని., కాదు.



ఇంట్లో అలా కూర్చుంటే విసుగేస్తుందని."

నవ్వేసి ఊరుకుంది.

ఊరి పొలిమేరలు దాటి మహాబలిపురంరోడ్ పట్టింది కారు. మీ శ్రీవారేం చేస్తుంటారు శైలజా?"

"వ్యాపారం!"

నవ్వొచ్చిందావిడ ధోరణికి. "చీకటి వ్యాపారమా?"

"మరేం, మీకెలా తెలిసింది?—"

"భలేవారే! అది సరేగాని ప్రేమించి వివాహం చేసుకున్నారా?—"

"కాదు ఒకరిని ప్రేమించి మరొకరిని వివాహంచేసుకున్నాను"—

సడన్‌బ్రేక్‌వేసి కారాపి "నిజంగా" అని కలవరపడాడు. అయోమయమయిన అవస్థలో పడిపోయాడు.

ముఖం రెండుచేతుల్లో దాచేసుకుని ఏడ్వసాగింది. భగవంతుడెంత హృదయం లేనివాడు! ఈ అపరంజి బొమ్మతో, ఈమె మనసుతో ఆడుకోవడం సబబుగా ఉందా? అందుకే ఈమె జీవితం ఇలా అయింది. తొలిసారిగా భగవంతుడిమీద పట్టరాని ఆగ్రహం కలిగింది.

"ఛా అలా ఏడవకండి!" చనువుగా, లాలనగా ఆమెవీపు నిమురుతూ ఓదార్చ ప్రయత్నించేడు.

"ఎవరిని ప్రేమించేనో తెలుసా?—"

తలెత్తిచూస్తూ అడిగింది.

వింతగాచూసి తెలియదన్నాడు.

—"మిమ్మల్నే" అంది సుతారంగా మృదువుగా ఎలాటి భావమూ వ్యక్తపర్చకుండా, చలించకుండా!

మిన్ను విరిగి మీద పడ్డట్లనిపించింది. బ్యాలన్స్ తప్పిపోతున్నట్లనిపించింది. తల తిరిగిపోతోంది. విభ్రాంతితో చూస్తూ "నిజమేనా శైలజా?" నిభాయించుకుంటూ అతి కష్టం మీద అనగలిగేడు.

అంతవరకూ ఏడ్చినందుకు కళ్ళు ఎర్రబడాయి. నిజమేనంటూ ఆ కాటుక కళ్ళతోనే జవాబిచ్చింది.

"—పిచ్చిపిల్లా! నాలో ఏం చూసి ప్రేమించేవమ్మా! ఒకవేళ ప్రేమించినా నీలో దాచుకుని ఇలా అయిపోతే నాకెలా తెలుస్తుంది? నాకేమిటో అంతా అయోమయంగా ఉంది." తలపట్టుకుని బరువుగా పలికేడు. ఆనాటి శైలజరూపం అంతగా గుర్తులేదు. ఊహించినా అలా అన్పించడం లేదు. పదిహేనేళ్ళ గతం ఎంతకీ కళ్ళ ముందు కన్పించడం లేదు. నేనేమయినా అలా ప్రవర్తించేనా? అలాంటి ఆశలు ఆ అమ్మాయికి రేకెత్తించేనా అని ఆలోచిస్తే లేదనే మనసు ఘోషిస్తోంది.

"మీ తప్పేంలేదు. ఊహలు వెర్రితలలు వేసేప్రాయంలో కాకతాళీయంగా మనం కలుసుకున్నాం. మీరెన్నడూ నాతో అలా ప్రవర్తించలేదు. నేనే మిమ్మల్ని ప్రేమించేను. కాని చెప్పలేకపోయాను. బి.ఎ. అవగానే శారద పెళ్లి అయి వెళ్లిపోయింది. ఎం.ఎ. చదివితీరాలని పంతంపట్టి చదివేను. మీకోసం ఎలా గాలించను? ఏమని చెప్పను? అనిల్‌కుమార్‌గారితో వివాహమైపోయింది."

కళ్లు చెమర్చేయి. ఆమె సౌజన్యానికి సంస్కారానికి.

"—మీరు డాక్టర్! మీకు సెంటిమెంట్స్ ఉండవ్. నేనలా కాదు! భావుకురాలిని. నా భర్త బిజినెస్‌మెన్. వారిదో లోకం! నాదొక లోకం! మానసికంగా నేను బాధపడుతున్నానని నన్ను నయం చేయమని కిశోర్‌గారికి ఒప్పగించేరు. వారు కృతకృత్యులు కాలేక మిమ్మల్ని పిలిపించేరు. నన్ను మామూలు శైలజని చేయగలరా డాక్టర్ రవీ?"
సవాల్ చేస్తున్నట్లుగా ప్రశ్నించింది.

"—భలేవారే! మీకేమయిందని? మీ గురించి అందరూ వెర్రిగా ఊహించుకుంటున్నారు. అవన్నీ అబద్ధాలని నిరూపించండి. అప్పుడందరూ బ్రహ్మరథం పట్టి గౌరవిస్తారు—."

విస్మయంగా చూసి "నిజమా!" అంది.


"నిజం! శైలజా!—"

కారు మళ్ళీ నడపసాగాడు. మహాబలిపురం చేరుకున్నారు.

"లైట్‌హౌస్‌కి వెళదామా?"

"వద్దు డాక్టర్! బీచ్ దగ్గిర కూర్చుని వెళ్ళిపోదాం!" సముద్రానికి కాస్త దూరంలో ఇసుకలో కూర్చున్నారిద్దరూ.

జనం చాలామంది ఉన్నారు. జంటలు




జంటలుగా, స్వేచ్ఛగా ఆనందంగా, విహారం చేయడానికి వచ్చేరు. శైలజని చూసేడు. పదిహేనేళ్ళ ప్రచ్ఛన్న ప్రేమ హృదయంలో దాచుకున్న శైలజలాగానే కన్పించింది. బంగాళాఖాతంలోవి ఎగసిపడే కెరటాలు చూస్తూంటే బేల అయిన శైలజ ముఖం గుర్తొచ్చింది.

ఉదయం చూసిన శైలజకీ, ప్రస్తుతం ఎదురుగా దగ్గిరగా చూస్తున్న శైలజకీ చాలా తేడాఉంది. కళ్ళు కాంతివంతంగా ఉన్నాయి. మొఖం ప్రశాంతంగా కన్పిస్తోంది.

"మీకు వివాహమైందా?"— సిగ్గుపడుతూనే అడిగింది—లేదు అని నవ్వుతూ జవాబిచ్చేడు రవి.

"ఎవరినయినా ప్రేమించేరా?" సంశయంగా అడిగింది.

"లేదు మేడమ్! కలలో కూడా!"

నవ్వాపుకుంటూ "భలేవారే" అంది.

"కాఫీ తాగుదాం రండి" అంటూ లేచి నిలబడ్డాడు.

కాఫీ ముగించగానే వెంటనే బయలుదేరేరు మెడ్రాస్.

"—డాక్టర్! కిశోర్‌గారితో ఈ విషయం చెప్పకండి!" ఆమె గొంతు బొంగురుపోయింది.

"ఒక షరతుమీద!—"

"ఏమిటో!" ఆశ్చర్యంగా చూసింది.

"శైలజ వెన్నెలరేఖలా ఉండాలి! మళ్ళీ కవిత్వం రాయాలి. జీవితం అంటే

శైలజ అని అందరికీ అసూయకలిగే లాగా ప్రవర్తించాలి. మీ హృదయాన్ని నమ్ముకోండి. అందులోనున్న అనుభూతులను వమ్ముచేయకండి. సైకాలజీ ఎం. ఎ. చదివిన మీకు ఇంతకు మించి నేనేం చెప్పగలను మేడమ్? అనీల్ కుమార్‌కి కాదు శిలకి కూడా ప్రాణం పోయగలశక్తి మీకుంది. దాన్ని మీరు నిరూపించాలి."

జవాబివ్వకుండా పరధ్యానంగా వింటూంది!

"ఒకమాట చెప్పనా, వింటారా?"

"చెప్పండి" అంది.

"మీరు అనీల్ కుమార్ గారిమీద ప్రేమ కురిపించాలి. అది మీ కర్తవ్యం! క్షణికమైన ప్రణయానికి నిండుజీవితం పణంగా పెట్టకండి—" ఆమె కళ్ళు చెమర్చబోతున్నాయి. ఆ కళ్ళు తుడవాలన్పించింది ముద్దుపెట్టుకోవాలనే లాలస కలిగింది. కాని అవేం చేయలేని నిస్సహాయుడు.

"మిసెస్. శైలజా! నా నుంచి మీకె లాంటి సహాయం కావాలన్నా డిమాండ్ చేయగల హక్కు మీకుంది. మర్చిపోకండి—"

"థాంక్స్ — నాకివాళ జీవితంమీద కొత్త ఆశ కలిగించేరు. మిమ్మల్ని నొప్పించను. అసలెవరికీ నానుంచి బాధ కలిగించను"— నిండు హృదయంతో అంది. మద్రాస్ చేరుకున్నారు. కిశోర్ ఇంటిముందు కారాగింది. దిగబోతున్న ఆమెని పరీక్షగా చూసేడు. కళ్ళల్లో సంతోషం విషాదం సమానంగా సరితూగుతున్నాయి.

"హల్లో కిశోర్!" అంటూ లోపలికి వెళ్ళాడు రవి. "కిశోర్! శైలజ ఇకమీద తప్పకుండా కొత్తరూపంలోనే కన్పిస్తుందని ఇదే నా హామీ." గట్టిగా కౌగలించుకుని "థాంక్స్ రవి, థాంక్స్" అన్నాడు ఆనందాతిరేకంగా కిశోర్. అదేరాత్రి అనీల్‌ని రమ్మని ట్రంకాల్ చేసేడు. వెంటనే వచ్చేడు అనీల్. మేఘబాల లాగా కన్పించింది శైలజ అతని కళ్ళకి.

వారం రోజులపాటు సరదాగా గడిపేరంతా. వెళ్ళిపోతూ హైద్రాబాద్ రమ్మని మరీ మరీ అహ్వానిస్తూ, పాదాభివందనం చేసింది శైలజ రవికి. సెండాఫ్ ఇవ్వడానికి స్టేషన్‌కి వెళ్ళి తిరిగి వచ్చేస్తూంటే తెలియని ఆవేదన కలిగింది రవికి. తను సైకియాట్రిస్ట్. తనకేదో పట్టింది. అంతరాంతరాలలో శైలజరూపం తప్ప మరేం కన్పించడంలేదు. పిచ్చి కుదర్చబోయి పిచ్చెక్కినవాడిలాగా అయింది రవి మనసు.

స్నేహపూర్వకంగా కృతజ్ఞతతో, రవి చేతిని తనచేతుల్లోకి తీసుకుంటూ 'థాంక్స్' అన్నాడు కిశోర్. కిశోర్ బలవంతాన మరో వారంరోజు లక్కడేఉండిపోయాడు రవి. ఒక మధ్యాన్నం ఇద్దరూ తీరికగా కబుర్లు చెప్పకుంటూ కూర్చున్న సమయంలో పోస్టుమెన్ వచ్చి ఉత్తరం అందించేడు.

"నా ప్రియమైన కిశోర్! జన్మజన్మాంతరాల బాంధవ్యం మనది అని మనిద్దరం గర్వపడేలా మరొక్కసారి రుజువుచేసేవు. నా శైల చాలా మారిపోయింది. ఇదంతా నీ చలువ. నీ ప్రియమిత్రుడి ధర్మభిక్ష. శైలజ కబుర్లూ, శైలజ సాన్నిధ్యం, మళ్ళీ మళ్ళీ ఇదే జన్మ కావాలంటూ అనుకునేలా చేస్తున్నాయి. నా ఇంట్లో దివ్యకాంతులు వెదజల్లే దీపకళిక నా శైలజ. మిమ్మల్ని ఇద్దరినీ నా ఇంటికి రమ్మని మా ఆతిధ్యం స్వీకరించి మమ్మల్ని కొంతయినా విముక్తులని చేయమంటూ మా విన్నపం! కాదనరు కదూ? మీ రాకకై నిరీక్షిస్తూ—శుభకాంక్షలతో—నీ అనీల్." ఉత్తరం చదవడం ముగించిన కిశోర్‌ముఖం ఆనందంతో వెలిగిపోతోంది. చదవమంటూ రవి కందించేడు. ఉత్తరం చదివిన రవికి నవ్వొచ్చింది. ఇదంతా తన గొప్పేనని వీళ్ళందరూ అందలం ఎక్కించేస్తున్నారు. సైకియాట్రిస్ట్‌గా తనేం ఆవిడకి నయం చేయలేదు. నిజానికి తను నిమిత్తమాత్రుడు. శైలజ మారింది. ఇందులో కథేంలేదు. ఇన్నేళ్ళుగా శైలజ తనని ప్రేమించింది.

తను ఆ ప్రేమలతని పెరగకుండా త్రుంచివేశాడు... లీలగా ఆనాటిదృశ్యం రవి కళ్ళముందు మెదిలింది.

...ఆ రోజు... మహాబలిపురం వెళ్ళి తిరిగివచ్చిన నాటిరాత్రి. తను గదిలో కూర్చొని, అరిస్టోక్రాట్ బాటిల్ ఎత్తి పట్టుకొని గ్లాసులో పోస్తున్నాడు! గదిబైట సుతిమెత్తని అడుగులచప్పుడు వినిపించింది. రవికి తెలుసు, ఆ అడుగుల చప్పుడు ఎవరిదో! గ్లాసులోకి స్పెన్సర్ సోడా వంపి, తాగుదామని గ్లాసెత్తేడు.

అంతలో విసురుగా తలుపు తోసుకుని, గుమ్మంలో నిలబడ్డ శైలజ కన్పించింది. అక్కడే ఆగిపోయి, తనవేపు ఆశ్చర్యంగా చూసింది. నమ్మలేనట్లు కళ్ళింతలుచేసుకొని చూసింది. మరుక్షణంలో— చప్పున తలుపు దగ్గరగా వేసి—వెళ్ళిపోయింది.

"ఆల్కహాలికులు" అంటే శైలజకి ఎలర్జీ అని అతనికి తెలుసు. తనని హీరోలాచూస్తూ, వర్షిప్ చేస్తోన్న శైలజ తనీనాడు చెయ్యబోయిన పనిని చూసి తప్పక తనను అసహ్యించుకుంటుంది. అదే కావాలి తనకి!

— ఈ వేళ తనామెని విపరీతంగా ప్రేమిస్తూ ఆరాధిస్తున్నాడు. విధివిషాద గీతం ఆలపిస్తూంది.